క్లుప్తంగా

నేడు జిల్లేడుపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష

బంగారుపాళెం: మండలంలోని జిల్లేడుపల్లెలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తుంబకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు వైద్య శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్

ఐరాల: మండల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ మోహన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి మండల అభివృద్ధి ప్రణాళికపై ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీల వారీగా చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. గ్రామాల్లో అత్యవసరంగా చేయవలసిన పనులపై ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు. స్థిరమైన అభివృద్ధి సాధించడానికి అవసరమైన లక్ష్యాలను నిర్ధారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుసుమకుమారి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

స్పందనకు 24 అర్జీలు

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. దారి సమస్యలు భూ తగాదాలు, సర్వే, రేషన్ కార్డు తదితర సమస్యలపై మొత్తం 24 అర్జీలు వచ్చాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేలా చూడాలని వీఆర్వోలకు ఆయన ఆదేశించారు.

వైఎస్సార్ చేయూత నిధులపై అవగాహన



వైఎస్సార్ చేయూతపై అవగాహన కల్పిస్తున్న సీసీ

గుడిపాల: వైఎస్సార్ చేయూత నిధులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వెలుగు సీసీ హేమచంద్రారెడ్డి అన్నారు. వసంతాపురం పంచాయతీలో పశుమంద, వసంతాపురంలోని మహిళాసంఘ సభ్యులకు వైఎస్సార్ చేయూత నాలుగో విడత నిధులపై వారికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 45 నుంచి 60 ఏళ్ల ఎస్సీ, బీసీ, మైనారిటీ మహిళలకు రూ.18,750 అందించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు పొదుపు గ్రూపుల్లో కావలసిన వారికి నగదు ఇవ్వనున్నట్లు చెప్పారు. వీటిని రుణంగా తీసుకొని ఆదాయ అభివృద్ధిని మరింత మెరుగు పరచుకోవాలన్నారు. వచ్చిన నగదు ద్వారా ఏదో ఒక వ్యాపారం ప్రారంభించి లక్షాధికారులు కావాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సంఘమిత్రలు సరస్వతి, ఎస్తర్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో పనులు

చిత్తూరు కార్పొరేషన్: అటవీశాఖ తూర్పు రేంజ్ పరిధిలో పలు పనులు జరుగుతున్నట్లు ఎఫ్ఆర్వో థామస్ సోమవారం తెలిపారు. మంగళంపేట, చిత్తూరు నగర బీట్‌పరిధిలో రూ.6 లక్షల వ్యయంతో పీటీ ట్యాంక్ నిర్మిస్తున్నామన్నారు. వీటి ద్వారా వర్షపు నీరు వెళ్లిపోకుండా అడ్డుగా కట్ట ఉంటుందన్నారు. జంతువులు నీరు తాగడానికి ఇవి ఉపయోగపడుతుందన్నారు. ఎండలు ప్రారంభమయ్యాయని, అటవీ ప్రాంతంలో ఆకతాయిలు నిప్పు పెట్టవద్దని కోరారు.

పీహెచ్‌సీకి ఆక్సిజన్ కాన్సంట్రేటర్ వితరణ



వైద్యాధికారికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేస్తున్న లలిత్‌సాగర్

ఐరాల: కాణిపాకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పూతలపట్టు మండలం గాండ్లపల్లెకు చెందిన ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, వినాయకమ్మ దంపతుల కుమారుడు లలిత్‌సాగర్ సోమవారం సుమారు రూ.50 వేల విలువ చేసే 5 లీటర్ల ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను వితరణ చేశారు. దాత సేవలు వెలకట్టలేనివని వైద్యాధికారి స్వాతిసిందూర కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ శివయ్య, సప్తగిరి బ్యాంక్ మేనేజర్ రమేష్‌బాబురెడ్డి పాల్గొన్నారు.



పూతలపట్టు: చెక్కు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్



కార్యక్రమానికి తరలివచ్చిన డ్వాక్రా మహిళలు

మహిళల అభ్యున్నతికి జగనన్న కృషి

- ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిన సీఎం వైఎస్ జగన్
- నాలుగు విడతల్లో రూ.35 కోట్లు లబ్ధి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్
- పండుగలా వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పూతలపట్టు: మహిళల అభ్యున్నతి, ఆర్థికాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కు పంపిణీ కార్యక్రమం పండుగలా సాగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సునీల్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. 2019 ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నాలుగో విడతల్లో డ్వాక్రా రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. మండలంలో ఆసరా ద్వారా రూ.8.93 కోట్లు నేరుగా మహిళల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో దాదాపు రూ.35.73 కోట్లు వైఎస్సార్ ఆసరా కింద అందించినట్లు వివరించారు. టీడీపీ పాలనలో మహిళలను గాలికొదిలేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు మునుపెన్నడు లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే హోం శాఖ, మంత్రి శాఖల్లో, నామినేటెడ్ పోస్టుల్లో కూడా మహిళలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. సంక్షేమ పథకాలు ఇస్తే ప్రజలు సోమరుపోతులవుతారని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అమ్మకు వందనం, స్త్రీ శక్తి అంటూ బూటకపు హామీలను ప్రకటించారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు హామీలన్నీ కేవలం ఎన్నికల సమయంలో ప్రజలను నమ్మించి మోసం చేయడానికేనని, రాజన్న బిడ్డ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పడు మడమ తిప్పడని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఒక్కసారి నమ్మి ఓటు వేసినందుకే కొన్ని కోట్ల రూపాయలను ప్రజల ఖాతాల్లో వేశారని చెప్పారు. మరోసారి ధైర్యంగా ఓటు వేసి గెలిపిస్తే రెండింతలుగా అభివృద్ధి చేసి చూపిస్తారని తెలిపారు. నవరత్నాలలో ఇచ్చిన పథకాలను 99 శాతం నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలిసి సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, ఎంపీపీ కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, సర్పంచ్ సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, రాజారత్నంరెడ్డి, స్థానిక సర్పంచ్ మాసిలామణి, సింగిల్‌విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, జయచంద్రారెడ్డి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఏపీఎం నాగరత్న, నాయకులు చంద్రా, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్

మండల కేంద్రంలో సింగిల్ విండో అధ్యక్షులు జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 'వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి మేము సిద్ధం' పోస్టర్లను డాక్టర్ సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ తరఫున కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం చేసిన మేలును లబ్ధిదారులకు, ప్రజలకు కార్యకర్తలు క్లుప్తంగా తెలియపరచాలని తెలిపారు. ఎన్నికలకు 55 రోజులు ఉండడంతో మండలంలోని ప్రతి కార్యకర్త, నాయకుడు జగనన్న వారధిగా పనిచేయాలని తెలిపారు. సమయం తక్కువగా ఉందని నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దేవిక, అమర్నాథరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు జయచంద్రారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ యువత అధ్యక్షులు నవీన్‌రెడ్డి, యతీష్, ప్రవీన్, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందనలో సమస్యల పరిష్కారం



సమస్యలు వింటున్న సహాయ కమిషనర్

చిత్తూరు అర్బన్: స్పందనలో ప్రజల నుంచి వచ్చే సమస్యలకు పరిష్కారం చూపాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ గోవర్ధన్ ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించి, ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగాలకు సంబంధించిన వచ్చిన ఫిర్యాదులపై ఆయన సమీక్షించారు. వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు.

మొగిలిలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించినట్లు ఈఓ మునిరాజులు తెలిపారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహుకాల సమయంలో ప్రత్యేక పూజలైన రాహు, కేతు, సర్పదోష నివారణ పూజా కార్యక్రమాలను చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు రాహుకేతు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



శివాజీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో సోమవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటాన్ని నగర వీధుల్లో ఊరేగించారు. సతీష్ కృష్ణమూర్తి, బాలు బాలకృష్ణ, జగదీష్, భాస్కర్, మధు, సాగర్, రాజా, బాలాజీ, ధరణి తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: ధైర్య సాహసాలతో గొప్ప వీరునిగా చరిత్రలో నిలిచిన శివాజీ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షుడు ధనంజయనాయుడు అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సుస్థిర పాలనతో శివాజీ ప్రజల హృదయాల్లో వీరునిగా నిలిచిపోయారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమనాథగౌడు, ధనపాండు, శంకరయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

గుడిపాల: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలని మండల విద్యాశాఖాధికారులు రామ్‌నాయక్, గణపతి అన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులకు నరహరిపేట, పానాటూరు, శ్రీరంగంపల్లె, పిళ్లారికుప్పం క్లస్టర్ పరిధిలో సీఆర్‌సీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు ఎలా చెప్పాలి, పాఠాలు చెప్పిన తరువాత విద్యార్థిని ఏ విధంగా చక్కదిద్దాలి? వారిలో ఉన్న నైపుణ్యాన్ని ఎలా వెలికితీయాలి అన్న వాటిపై వారికి వివరించారు. విద్యార్థులకు ప్రారంభదశలో చదవడం, రాయడంపై నైపుణ్యం పెంచాలన్నారు. గణితంలో పునాది అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలన్నారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేకం

చిత్తూరు రూరల్: నగరంలోని తోటపాళెంలో సోమవారం శ్రీవీరభద్రస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గణపతిపూజ, హోమపూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. కలశపూజలను భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. ఈ మహోత్సవానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం పలికి దుశ్శాలువలతో సన్మానించారు. స్వామి ప్రసాదం అందజేశారు.



కుంభాభిషేక పూజల్లో విజయానందరెడ్డి

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు





ఐరాల: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్, గుడిపాల: వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ రష్మిత

ఐరాల: మండలంలోని మారుమూల గ్రామాలకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందుతున్నాయి. బీరప్ప చెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలను వాడాలన్నారు. దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకు వెళ్లి, ప్రతి రోగికి వైద్యసేవలు అందజేస్తున్నట్లు బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. మండలంలో చింతగుంటూరు గ్రామంలో 104 వైద్య సేవలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రతి ఇంటి ముంగిటకు వైద్య సేవలను అందజేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వైద్యరంగంలో అనేక మార్పులు తీసుకువచ్చిందన్నారు. అనంతరం 67 మంది రోగులకు బీపీ, షుగర్, గర్భవతులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. గ్రామంలో మంచం పట్టిన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, వనజ, ప్రియాంక, సుజాతమ్మ, కోకిల తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియం.. ఆరోగ్యం.. ఆదాయం !

ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన దిగుబడి సాధించి, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృత పరిచేందుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎప్పటికప్పుడు అధికారుల ద్వారా సూచనలు సలహాలు ఇచ్చి మంచి దిగుబడికి తోడ్పాటును అందిస్తోంది. ఇందులో భాగంగా గత నాలుగేళ్లుగా మహిళా రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఒకే చోట మిశ్రమ పంటలు (వివిధ రకాల పంటలు) చేపట్టి మంచి ఆదాయాన్ని పొందుతుంది. మిశ్రమ పంటలతోపాటు చేపల పెంపకాన్ని కూడా చేపట్టి అధిక ఆదాయాన్ని పొందుతున్నారు.

- సేంద్రియ పద్ధతిలో మిశ్రమ పంటల సాగు
- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- పంటల సాగుతో చేపడుతున్న చేపల పెంపకం
- ఆర్థిక స్వావలంబన సాధిస్తున్న మహిళా రైతు



ఎకరా విస్తీర్ణంలో చేపడుతున్న మిశ్రమ పంటల సాగు



చేపల పెంపకం చేపడుతున్న కుంట

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు డివిజన్ పరిధిలోని పెనుమూరు మండలం చార్వాకానిపల్లెకు చెందిన బి.మునెమ్మ ప్రకృతి వ్యవసాయ విధానంతో పలు రకాల పంటలు, చేపల పెంపకాన్ని చేపడుతోంది. తమకున్న 1.5 ఎకరాల విస్తీర్ణంలో మిశ్రమ పంటలను సాగు చేస్తున్నారు. 2019లో వ్యవసాయ శాఖ అధికారుల సలహాల మేరకు ప్రకృతి వ్యవసాయ విధానంతో పంటల సాగు చేపట్టారు. ఈ విధానం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని పొందడంతో మరింత పంటల సాగుకు మహిళా రైతు ఆసక్తి కనబరచింది. దీంతో 2020 ఏడాదిలో ఆమె డ్వాక్రా సంఘం ద్వారా బ్యాంకు రుణం తీసుకుని 1.50 ఎకరాల విస్తీర్ణంలోమిశ్రమ పంటల సాగుతో పాటు చేపల పెంపకాన్ని కూడా చేపట్టారు. చేపల పెంపకానికి అవసరమైన కుంటను కూడా పొలంలోనే ఏర్పాటు చేసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంతో అవసరమైన ఘన, జీవామృతాలను కూడా ఆమె స్వతహాగా తయారు చేసుకుని పంటలకు ఎరువుగా వేయడం, పిచికారి చేయడం చేస్తున్నారు. ఘన, జీవామృతాలను తయారు చేసుకునేందుకు వీలుగా ఒక దేశవాళీ నాటు ఆవు, 5 జెర్సీ ఆవులను కూడా పోషిస్తున్నారు. ఈ ప్రక్రియతో ఆమె ప్రతి ఏటా ప్రకృతి విధానంతో ఒకేసారి పలు పంటల సాగుతో అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. ఏటా మిశ్రమం పంటలు, చేపల పెంపకం ద్వారా వచ్చే ఆదాయంతో బ్యాంకు రుణాన్ని చెల్లించి ఆర్థికాభివృద్ధిని సాధిస్తోంది.

సాగు చేస్తున్న పంటలు

ఎకరా విస్తీర్ణంలో మామిడి పంటను సాగు చేస్తూ అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు, పందిరి చిక్కుడు, గోరు చిక్కుడు, అనప, మిరప, రక్షక పంటలుగా అవిష, జొన్న, సజ్జ, ఆముదం, బంతి పూలు తదితర పంటలను సాగు చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా వివిధ పంటల సాగు వల్ల పెట్టుబడి ఖర్చులు పోగా మొత్తం రూ.2.09 లక్షల మేరకు నికర ఆదాయాన్ని పొందారు. అదేగాక పాడి ఆవుల ద్వారా రూ.45 వేల ఆదాయాన్ని పొందారు.



ఎకరా భూమిలో సాగవుతున్న మిశ్రమ పంటలు

చేపల పెంపకం

పంటల సాగుకు పోగా మిగిలిన అర ఎకరా విస్తీర్ణంలో చేపల పెంపకాన్ని చేపట్టేందుకు వీలుగా కుంటను ఏర్పాటు చేశారు. 2021లో చేపల పెంపకానికి కుంటను ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఏడాది మొదటగా 6 వేల చేప పిల్లల పెంపకం చేపట్టారు. ఇందుకుగాను మొత్తం రూ.1.35 లక్షల మేరకు పెట్టుబడి పెట్టగా, దిగుబడి దాదాపు 3 టన్నుల మేరకు వచ్చింది. దీనిద్వారా ఖర్చులు పోగా నికర ఆదాయం రూ.1.65 లక్షలు వచ్చింది. దీంతో ప్రతి ఏటా 12 వేల చేప పిల్లలను పెంచుతూ రూ.2.40 లక్షల మేరకు ఆదాయాన్ని పొందుతున్నారు. ఈ విధానంతో అతి తక్కువ విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగుతోపాటు, చేపల పెంపకం, పశువుల పెంపకాన్ని చేపట్టి మహిళా రైతు ఆర్థికాభివృద్ధిని సాధిస్తోంది.

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం



ప్రకృతి వ్యవసాయన్ని చేపట్టడం వలన తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని పొందుతున్నాం. గతంలో రసాయన ఎరువుల వాడకంతో పంటల సాగుకు అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సి వచ్చేది. అయినా పంట నాసిరకం దిగుబడి చేతికందడం వల్ల పెట్టుబడి కూడా చేతికందేది కాదు. ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వడంతో అధికారుల సూచనల మేరకు మాకున్న ఒకటిన్నర ఎకరా విస్తీర్ణంలోనే వివిధ రకాల పంటలు సాగు చేశాం. అదనంగా చేపల పెంపకాన్ని కూడా చేపట్టి అధిక ఆదాయాన్ని పొందుతున్నాం.

– బి.మునెమ్మ, చార్వాకాని పల్లె, పెనుమూరు మండలం

తుదిదశకు ఎస్‌పీఎం పనులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులోని ట్రాన్స్‌కో ఎస్‌పీఎం (ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం) భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరాయని డీఈ ఆనంద్ సోమవారం తెలిపారు. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని, వాటికి త్వరలో కనెక్షన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రహరీగోడ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. గతంలో ఉన్న కాంట్రాక్టర్‌ను మార్పు చేసి మరో కాంట్రాక్టర్‌ను పెట్టి పనులు వేగం చేశామన్నారు. మార్చి మొదటి వారంలో భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

టీడీపీలో గుబులు రేపిన సిద్ధం

గుడిపాల: రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభ విజయవంతం కావడంతో తెలుగుదేశం నాయకుల్లో గుబులు మొదలైందని, స్థానిక సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, యువత అధ్యక్షుడు శిలంబరసన్, వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్ అన్నారు. వారు సోమవారం మీడియాతో మాట్లాడుతూ మండలంలో కొంతమంది తెలుగుదేశం నాయకులకు సిద్ధం సభకు వచ్చిన అశేష జనవాహినిని చూసి గుబులు రేపుతోందని చెప్పారు. కొంతమంది జనం లేరంటూ మాట్లాడుతున్నారని, మరికొంత మంది తమకు ఫోన్‌లు చేసి సిద్ధం సభ చాలా సక్సెస్ అయ్యిందని చెబుతున్నారని చెప్పారు. ఇప్పటికే మండలంలో ఎక్కడ చూసిన జగన్ అనే పేరు మారుమోగి పోతుండడం చూసి టీడీపీకి వెన్నులో వణకు పుట్టిందని చెప్పారు. ఏది ఏమైనా మండలంలో ఈ సారి 2019 ఎన్నికల్లో కన్నా అత్యధిక మెజారిటీతో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు